క్లుప్తంగా

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



కలశ పూజ చేస్తున్న ఆలయ ధర్మకర్తలు వినోదమ్మ-మురళీధర్‌రెడ్డి దంపతులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని హరిహరక్షేత్రం, మల్లన్నగుట్ట ఆలయంలో కొలువుదీరిన లలిత పరమేశ్వరి అమ్మవారి ఆలయ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు అల్లోల వినోదమ్మ-మురళీధర్‌రెడ్డి దంపతులు అమ్మవారికి పూజలు చేశారు. 108 కలశాలతో అమ్మవారికి పంచమృతాభిషేకం, కుంకుమార్చన, నూతన వస్త్రాలంకరణ, తదితర పూజ కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. భక్తులు ఈసవోయిన దేవేందర్ యాదవ్-రిషిత దంపతులు, రవీందర్ సహకారం అందించారు. గురుస్వామి మూర్తి, కోశాధికారి వేణుగోపాల్‌రెడ్డి, పూజార్లు, భక్తులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతు చేపట్టాలి



కుభీర్‌లో ఏర్పడిన గుంతలు

కుభీర్: మండల కేంద్రం నుంచి వివేకానంద చౌక్‌వరకు ఉన్న రోడ్డు మొత్తం గుంతలమయంగా మారింది. గత పదేళ్ల క్రితం వేసిన రోడ్డుకు మరమ్మతు లేవు. రాకపోకలు సాగించే వాహనదారులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై అర్‌అండ్‌బీ డీఈ సునీల్‌ని వివరణ కోరగా, త్వరలో రోడ్డుకు మరమ్మతు చేయిస్తామన్నారు.

పుష్ప-2 సింగర్‌కు సన్మానం



లక్ష్మిని సన్మానిస్తున్న డాక్టర్లు, కవులు

నిర్మల్‌టౌన్: పుష్ప-2 మూవీ సింగర్ జిల్లా వాసి దాస లక్ష్మిని పలువురు కళాకారులు, కవులు, వక్తలు సన్మానించారు. జిల్లా కేంద్రంలోని వెన్నెల డ్యాన్స్ అకాడమీలో సోమవారం ఆమెకు శాలువాతో సత్కరించి, జ్ఞాపిక అందజేశారు. వైద్యులు అవినాష్, కృష్ణంరాజు, వెన్నెల డ్యాన్స్ అకాడమీ డైరెక్టర్ ధనరాజ్, ప్రముఖ కవి వెంకట్, కళాకారులు, డాన్సర్లు పాల్గొన్నారు.

శివాలయాల్లో పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

లక్ష్మణచాంద: మండలంలోని వివిధ గ్రామాల్లోని శివాలయాల్లో సోమవారం భక్తులు పూజలు నిర్వహించారు. ధనుర్మాసం పురస్కరించుకొని బాబాపూర్ శివాలయంలో భక్తులు పోటెత్తారు. ఉదయం శివలింగానికి పూజలు చేసి మొక్కలు చెల్లించుకున్నారు.

బీజేపీ బూత్ నూతన కార్యవర్గం



ఎన్నికపత్రం అందుకుంటున్న అధ్యక్షుడు

ఖానాపూర్: పట్టణంలోని విద్యానగర్‌కాలనీలో 233 బూత్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ అంకం మహేందర్, అసెంబ్లీ సభ్యత్వ నమోదు కోఆర్డినేటర్ ఆకుల శ్రీనివాస్ తెలిపారు. అధ్యక్ష, కార్యదర్శులుగా దానవెల్లి సుధాకర్, ఎనగందుల కుమార్ తదితరులు ఎన్నికయ్యారు. నాయకులు ఉపేందర్, అనిల్‌రావు, చంద్రశేఖర్, నర్సయ్య, తదితరులు ఉన్నారు.

ధనుర్మాస ఉత్సవాల ప్రతుల అందజేత

ఖానాపూర్: ఈనెల 16న ప్రారంభమైన ధనుర్మాస ఉత్సవాలు జనవరి 14 వరకు కొనసాగుతాయి. పట్టణంలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వర ఆలయ ఆవరణలో అర్చకుడు నర్సింహమూర్తి సోమవారం భక్తులకు ధనర్మాస ఉత్సవాల ఆహ్వాన ప్రతులు అందజేశారు.

ఉన్నతికి రుణం.. స్వయం ఉపాధికి అందలం

- ఆర్థికప్రగతి దిశగా మహిళలు
- ఉపాధి పొందుతున్న మహిళామణులు
- ఆదర్శంగా నిలుస్తున్న పలువురు..

నర్సాపూర్(జి): గ్రామీణ ప్రాంతాల్లోని స్వయం సహాయక బృందాల మహిళలు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక చేయూత ద్వారా స్వయం ఉపాధి పొందుతున్నారు. రుణాలు పొందిన మహిళలు సొంతంగా తమ కాళ్లపై తాము నిలదొక్కుకునేలా మార్గాలను అన్వేషించుకుని ఆర్థికంగా బలోపేతం అవుతున్నారు. స్వయం ఉపాధి యూనిట్ల ద్వారా కిరాణం, కుట్టు మిషన్, పిండి మర, బట్టల షాపు తదితర వంటివి ఏర్పాటు చేసుకుని తమ కుటుంబాలకు ఆసరాగా నిలుస్తున్నారు. ఆర్థికంగా పైచేయి సాధిస్తూ స్ఫూర్తిని నింపుతున్న మండలానికి చెందిన పలువురు మహిళామణుల విజయగాథలపై సాక్షి కథనం.

మండలంలో వివరాలు
స్వయం సహాయక సంఘాలు: 557
వీవోలు: 24
సభ్యులు: 6161



కుటుంబానికి ఆసరాగా..

ఈ చిత్రంలో ఉన్నది గొల్లమాడ గ్రామానికి చెందిన గంగుల సుజాత. విఘ్నేశ్వర క్లాత్ మర్చంట్ ఏర్పాటు చేసుకుని కుటుంబానికి ఆసరాగా నిలుస్తోంది. 2015లో శివ సాయి స్వయం సహాయక సంఘం సభ్యురాలుగా చేరింది. రూ.2 లక్షలు బ్యాంకులో రుణం తీసుకుని వ్యాపారాన్ని నడిపిస్తున్నారు. ప్రతినెల బ్యాంకు కిస్తూ చెల్లిస్తూ నెలకు రూ.12 వేలు సంపాదిస్తూ మహిళలకు ఆదర్శంగా నిలుస్తోంది.



రుణాలు తీసుకుని కిస్తీ చెల్లిస్తూ..

ఈచిత్రంలో ఉన్నది నర్సాపూర్(జి) మండల కేంద్రానికి చెందిన కాల్వ సృజన. లిట్టు మసాలా పిండి గిర్నీ కిరాణా జనరల్ స్టోర్ ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. 2013లో గంగా మహిళా సంఘ గ్రూపులో సభ్యురాలిగా చేరింది. పీఎంఎఫ్ఎంఈ ద్వారా రూ.3 లక్షలు, శ్రీ నిధి ద్వారా రూ.1,50,000 రుణాలు తీసుకుని వ్యాపారాన్ని మరింత అభివృద్ధి చేసుకున్నారు. ప్రతినెల బ్యాంకు కిస్తూ చెల్లిస్తూ నెలకు రూ.15 వేలు సంపాదిస్తుంది.

ఉపాధి పొందుతూనే కూతుళ్ల పెళ్లిళ్లు చేశా..



ఈ చిత్రంలో కనిపిస్తున్న మండల కేంద్రానికి చెందిన సాగి సవిత. శ్రీ నిధి స్వయం సహాయక సంఘ సభ్యురాలు. దిగువ మధ్యతరగతి కుటుంబానికి చెందిన ఈమె టైలరింగ్‌లో నైపుణ్యం కలిగి ఉంది. మొదట ఒక్క కుట్టు మిషన్‌తో ప్రారంభించి స్వయం సహాయక బృందంలో తీసుకున్న రుణాలతో దుకాణాన్ని అభివృద్ధి చేస్తూ వచ్చింది. అలా టైలరింగ్ షాప్‌తోపాటు జనరల్ స్టోర్ ఏర్పాటుచేసుకుని ఆర్థికంగా బలోపేతమైంది. తన ఇద్దరు కూతుళ్లను చదివించి పెళ్లిళ్లు చేసింది. ఇటీవలి డీఎస్సీలో పెద్ద కూతురు రాగసుధ ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా ఎంపిక కావడం విశేషం.

స్వశక్తితో ఎదగాలని..



ఈ చిత్రంలో ఉన్నది అర్లి(కే) గ్రామానికి చెందిన సిర్మని ఉమావతి. పీఎంఎఫ్ఎంఈ బ్యాంకు రుణం రూ.3 లక్షలతో పిండిగిర్నీ ఏర్పాటు చేసుకుంది. నెలకు రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు సంపాదిస్తూ కుటుంబానికి ఆసరాగా నిలుస్తోంది.

వ్యాపార రంగాల్లో రాణించాలి

మహిళలు వ్యాపార రంగంలో రాణించేందుకు ప్రోత్సహిస్తున్నాం. పీఎం ఎఫ్ఎంఈ పథకం కింద వ్యాపార అభివృద్ధికి రుణాలు మంజూరు చేయిస్తున్నాం. ఆర్థికంగా ఎదగాలనే మహిళలు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి.
– సునంద, ఏపీఎం, నర్సాపూర్ (జి)

ఇద్దరికి సేవా పురస్కారాలు



పురస్కారం అందుకున్న రోహిత్



పురస్కారం అందుకున్న పంచగుడి మహేశ్

భైంసాటౌన్: పట్టణానికి చెందిన ఐక్యత సేవాసమితి సభ్యుడు రోహిత్, దివ్యాంగశక్తి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పంచగుడి మహేశ్‌కు సేవా పురస్కారాలు పొందారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో తెలుగు వెలుగు సాహిత్య జాతీయ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జాతీయ సాహిత్య సంబరాలు కార్యక్రమంలో ఈ మేరకు సేవా పురస్కారాలు అందజేశారు. తమ సేవా కార్యక్రమాలను గుర్తించి ఈ మేరకు పురస్కారం అందజేసినట్లు రోహిత్, మహేశ్ తెలిపారు.

మున్సిపల్ అక్రమాలపై విజిలెన్స్ విచారణ చేయాలి



వినతిపత్రం ఇస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఖానాపూర్: మున్సిపాలిటీలో ఇదివరకు చేపట్టిన పనుల్లో జరిగిన అవినీతి అక్రమాలపై విచారణ చేపట్టాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్యాలయంలో ఈ విషయమై సిబ్బందికి సోమవారం వినతిపత్రం అందజేశారు. రూ.90 లక్షల నిధుల్లో అక్రమాలు జరిగాయని చెబుతున్న అధికార పార్టీ నేతలు శిలాఫలకాలపై పేర్లు రాసుకుని ప్రారంభం చేయాల్సిన అవసరం ఏంటని ప్రశ్నించారు. గతంలో చైర్మన్ ఎన్నికకు ముందు అక్రమాలపై విజిలెన్స్ విచారణ చేయిస్తామని చెప్పినా చైర్మన్ అయ్యాక ఎందుకు చేయించలేదో చెప్పాలన్నారు. అవినీతికి పాల్పడ్డ బీఆర్ఎస్ నాయకులను కాంగ్రెస్‌లో చేర్పిస్తే నీతిపరులు అయిపోతారా అని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో మున్సిపాలిటీకి కేటాయించిన రూ.25 కోట్లు వెనక్కి వెళ్తే ఎందుకు మౌనంగా ఉన్నారో చెప్పాలన్నారు. అనంతరం ఈ విషయమై జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. నాయకులు రాజు, రాజగంగన్న, కలీల్, సుమన్, ప్రదీప్, మోహిద్, వాల్‌సింగ్, రాజన్న, గజేందర్, చంద్రహస్, లింగన్న, శ్రావణ్, విజయ్, కళావతి, శ్రీనివాస్, గోపాల్, సుమిత్, ప్రశాంత్‌రెడ్డి ఉన్నారు.

తపాలా సేవలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న బీపీఎం రాధిక

భైంసారూరల్: తపాలా శాఖ సేవల పొదుపు పథకాలతో ప్రయోజనం ఉంటుందని భైంసా పీఐటీ దిలీప్ అన్నారు. మండలంలోని పేండ్‌పెల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో తపాలా సేవలు, పొదుపు పథకాలు, సుకన్య సమృద్ధియోజనపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తపాలా శాఖ ప్రతీ గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించడానికి డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం పథకాన్ని ప్రారంభించిందన్నారు. పొదుపు, బీమా పథకాలు తక్కువ ప్రీమియంతో అధిక లాభాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో బీపీఎంలు రాధిక, రీతు, పాఠశాల హెచ్‌ఎం అమృతం, ఉపాధ్యాయులు గోపాల్, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రతిష్ఠాపన వేడుకలు



పూజలు చేస్తున్న కాలనీవాసులు

భైంసాటౌన్: పట్టణంలోని కిసాన్‌గల్లిలో గల శ్రీరాజరాజేశ్వర ఆలయంలో సోమవారం ప్రతిష్ఠాపన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు, ఆలయ కమిటీ సభ్యులు ఆలయంలో మహాభిషేకం, హారతి, పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ గంగాధర్, సర్పంచ్ కుంట రాజలింగు, ఉప సర్పంచ్ సాయినాథ్, ప్రధాన కార్యదర్శి సతీశ్, కోశాధికారి రాజు, మాజీ సర్పంచ్ చిన్నన్న, ప్రవీణ్, కానోళ్ల సందేశ్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భీమన్న జాతర



కొలువుదీరిన భీమన్న గదలు

లక్ష్మణచాంద: మండలంలోని చింతల్‌చాందలో భీమన్న జాతరను సోమవారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు గోదావరి నది నుంచి భీమన్న గదలను ఆలయానికి తరలించి ప్రతిష్ఠించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయం ముందు ఏర్పాటు చేసిన అగ్నిగుండం గుండా భక్తులు దాటారు.

బీమా చెక్కుల అందజేత



చెక్కులు అందజేస్తున్న చైర్మన్, మేనేజర్

కడెం: మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో సోమవారం ముగ్గురు లబ్ధిదారులకు బీమా చెక్కులు అందజేసినట్లు చైర్మన్ రామడుగు శైలజరమేశ్‌రావు అన్నారు. సొసైటీలో రుణం పొందిన రైతులకు రూ.803 ప్రీమియంతో సాధారణ, ప్రమాద మరణాలకు రూ.2 లక్షల బీమా వర్తిస్తుందన్నారు. ఏడీసీసీ మేనేజర్ రాజేశ్వర్‌రావు, డైరెక్టర్ గొల్ల వెంకటేశ్, సీఈవో రాజేందర్ తదితరులు ఉన్నారు.

చలి చదువులు!



కుంటాల: రోజురోజుకు కనిష్ట ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. చలి తీవ్రతకు వృద్ధులు, పిల్లలు బయటకి వెళ్లలేని పరిస్థితి. కుంటాల ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఆరుబయట బోధన చేపడుతున్నారు. ఉదయం 10 గంటల నుంచి బడివేళలు మార్చాలని పోషకులు కోరుతున్నారు.

బండి సంజయ్‌ను కలిసిన ఎన్ఆర్ఐ



సంజయ్‌ని సన్మానిస్తున్న ఎన్ఆర్ఐ పన్నెల జనార్దన్

ఖానాపూర్: అమెరికాలోని గ్రేటర్ అట్లాంటా తెలంగాణ అసోసియేషన్ తాజా మాజీ అధ్యక్షుడు, ఖానాపూర్ వాసి ఎన్ఆర్ఐ పన్నెల జనార్దన్ సోమవారం కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌ను కలిశారు. కరీంనగర్‌లోని మహాలక్ష్మి ఆలయంలో నిర్వహించిన అయ్యప్ప పడిపూజ మహోత్సవానికి హాజరయ్యారు. కేంద్ర సహాయమంత్రిగా బాధ్యతలు చేపట్టాక బండి సంజయ్‌ను తొలిసారి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన్ను సన్మానించారు.

భూసార పరీక్షలు వినియోగించుకోవాలి



అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

పెంబి: ప్రభుత్వాలు నిర్వహిస్తున్న ఉచిత భూసార పరీక్షలను రైతులు వినియోగించుకోవాలని ఏవో నవీన్ అన్నారు. మండలంలోని కిష్టునాయక్ తండా, ఇటిక్యాల్, లోతోర్యతండా, తాటిగూడ గ్రామాల్లో భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆస్పిరేషన్ బ్లాక్ ప్రోగ్రాంలో భాగంగా పెంబి మండలం ఎంపిక చేసినందున 3,400 మంది రైతులకు ఉచితంగా భూసార పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏఈవోలు రాజ్‌కుమార్, లక్ష్మణ్, రైతులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో ఇందిరమ్మ ఇళ్ల వివరాలు



ధర్మోరలో ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేస్తున్న ఎంపీడీవో వెంకటరమేశ్

లోకేశ్వరం: మండలంలోని ధర్మోర గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను అధికారులు సోమవారం ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. మండలంలో ప్రజాపాలనలో భాగంగా 9,138 దరఖాస్తులు వచ్చాయని, గ్రామానికి వెళ్లి వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామని ఎంపీడీవో తెలిపారు. ఆయన వెంట ఎంపీవో సోలమాన్‌రాజ్, గ్రామ కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి ఉన్నారు.

సన్మానం



సంజీవ్‌కుమార్‌ను సన్మానిస్తున్న బీజేపీ నేతలు

ముధోల్: ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన సంజీవ్‌కుమార్‌ను బీజేపీ నాయకులు సోమవారం సన్మానించారు. పోలీసుస్టేషన్‌లో ఆయన్ను శాలువతో సత్కరించి అభినందనలు తెలిపారు. మండల అధ్యక్షుడు కోరి పోతన్న, పీఏసీఎస్ డైరెక్టర్ ధర్మపురి సుదర్శన్, నాయకులు తాటివార్ రమేశ్, బత్తినోళ్ల సాయి, సాయినాథ్, లవణ్, గంగాప్రసాద్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ



పూజలు చేస్తున్న స్వాములు

కుభీర్: మండలంలోని రంజనిగ్రామంలో అయ్యప్ప పడిపూజను సోమవారం వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు అనంతరం స్వాముల భిక్ష ఏర్పాటు చేశారు. గురుస్వాములు దేవేందర్, గులాబ్, ప్రభాకర్, అనిల్, సంజు, స్వాములు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో ఆవు మృతి

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని గాజుల్‌పేట్ శివారు పంట పొలంలో రైతు బాలరాజ్‌కు చెందిన ఆవు సోమవారం విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. పొలంలో ఆవు మేస్తుండగా తెగిపోయిన విద్యుత్ తీగలు తీగలు అక్కడికక్కడే మృతిచెందింది. దీని విలువ రూ.70 వేలు ఉంటుందని, ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని బాధిత రైతు కోరాడు.

దేవరకోటలో తిరుప్పావై ప్రవచనాలు

నిర్మల్‌ఖిల్లా: మహావిష్ణువుకు ప్రీతిపాత్రమైన మాసంగా కొలిచే మార్గశిరంలో ఆధ్యాత్మిక చింతన వెల్లివిరుస్తోంది. జిల్లా కేంద్రంలోని దేవరకోట శ్రీలక్ష్మీవెంకటేశ్వర ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు పురస్కరించుకొని సోమవారం నుంచి తిరుప్పావై ప్రవచనాలు మొదలయ్యాయి. పురోహితులు, ప్రవచనకర్త టీకే రామకణ్ణన్ ఆధ్వర్యంలో ఆళ్వారు దివ్య ప్రబంధ ప్రాజెక్టు, టీటీడీ సౌజన్యంతో ప్రతిరోజు ఉదయం 6:30 నుంచి తిరుప్పావై ప్రవచనాలు కొనసాగనున్నాయి. వచ్చే నెల 14వ తేదీ వరకు కార్యక్రమం నిర్వహించనున్నట్లు ధర్మకర్తలు పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయిలో విద్యార్థి ప్రతిభ

భైంసా: బాసరలోని నాగభూషణం పాఠశాలకు చెందిన విద్యార్థి నేత్ర కిశోర్ తెలుగు ప్రతిభ పరీక్షల్లో రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చాడు. ఈనెల 13న హైదరాబాద్‌లో తెలంగాణ సారస్వత పరీక్షకు ఆడిటోరియంలో మన సంస్కృతిసంస్థ పోటీలు నిర్వహించింది. మొదటిస్థానంలో నిలిచిన కిశోర్‌కు సినీ గేయరచయిత సుద్దాల అశోక్‌తేజ జ్ఞాపిక అందించారు. ఈ విద్యార్థిని బాసరలో సోమవారం పలువురు అభినందించారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

తానూరు: విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు భూమన్నయాదవ్ ఓ ప్రకటనలో తెలిపారు. కొన్నిరోజులుగా ఉద్యోగులు చేస్తున్న నిరవధిక సమ్మె విరమింపజేయడానికి ప్రభుత్వం న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరారు.

కార్యవర్గం ఎన్నిక

కడెం: మంచిర్యాల జిల్లా కేంద్రంలో జరిగిన అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘ మహాసభల్లో అఖిల భారత గ్రామీణా డాక్ సేవక్ సంఘ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. డివిజన్ అధ్యక్షుడిగా ఒరుగంటి స్వామి, కార్యదర్శిగా రాచమల్ల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా బొద్దుల మారుతిని ఎన్నుకున్నారు.

'అంబటి'కి 'గురుబ్రహ్మ' పురస్కారం



అంబటి నారాయణ(ఫైల్)

నిర్మల్‌ఖిల్లా: జిల్లాకేంద్రానికి చెందిన ప్రముఖ కవి, ప్రభుత్వ ఉపాధ్యాయుడు అంబటి నారాయణకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖపట్నానికి చెందిన మదర్ థెరిసా సోషల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ సంస్థ రాష్ట్రస్థాయి 'గురుబ్రహ్మ' పురస్కారాన్ని ప్రకటించింది. బోధన, సాహితీ, సామాజిక రంగాల్లో ఆయన చేస్తున్న విశిష్టసేవలకుగాను ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు కె.కృష్ణమూర్తి పేర్కొన్నారు. వీరు రచించిన బరువెక్కిన బతుకు, నెత్తుటి మరకలు, తడి, మోత, యువనేస్తం, ఇదీ నిజం, సమాజం తదితర రచనలు సాహితీవిపణిలో బహుళ ప్రాచుర్యాన్ని పొందాయి. ఆయనకు పురస్కారం లభించడం పట్ల జిల్లా కవులు, కళాకారులు, సాహితీవేత్తలు అభినందనలు తెలిపారు.